సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి



హనుమంతవాక కొండవాలులో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



జాలరిపేటలో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: రాష్ట్రంలో అమలవుతున్న పలు సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికాభివృద్ధి సాధించినట్టు వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా కార్పొరేటర్ స్వాతి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. వార్డులో హనుమంతవాక కొండవాలు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి మహిళలు, వృద్ధులు, యువకులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. తూర్పు నియోజకవర్గంలో రూ.కోట్లాది నిధులతో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఇంతటి అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డులో సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెడ్డు సత్యరాజు ఇంట్లో ఎంపీ సహపంక్తి భోజనం

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శుక్రవారం జాలరిపేటను సందర్శించారు. స్థానికంగా ఉన్న సమస్యలపై పలువురు గ్రామస్తులతో ముచ్చటించడంతో పాటు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా జాలరిపేటలోని తెడ్డు రాజు, సత్యల ఇంట్లో విద్యార్థులు, పార్టీ శ్రేణులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, దాసు, పరదేశి, వసంత, గణేష్, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

6 ఏళ్లు దాటిన చిన్నారులు పాఠశాలలో ఉండాలి

- డీఈవో చంద్రకళ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో చంద్రకళ

మల్కాపురం: ఆరేళ్లు దాటిన బాల,బాలికలు బడిలో ఉండాలని విశాఖ జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ అన్నారు. 61వ వార్డు మల్కాపురం జీవీఎంపీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె తొలుత పాఠశాల తరగతి గదులు, అక్కడ విద్యార్థులకు ఉపాధ్యాయులు అందిస్తున్న బోధన, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందా లేదా తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తన వద్ద విద్య నేర్చుకుంటున్న విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, ములగాడ మండల విద్యాశాఖ అధికారులు డి.వి.త్రినాథరావు, ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్‌కు సంబంధించిన సబ్‌స్టేషన్‌లో 33/11 కేవీ పరిధి 11 కేవీ కై లాసగిరి ఫీడర్ నిర్వహణ, హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాల తరలింపు పనుల కారణంగా ప్రధాన రహదారి ప్రాంతంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. హనుమంతవాక నుంచి కై లాసగిరి కూడలి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రాంతం ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

- ఆరిలోవ సబ్‌స్టేషన్‌లో 33/11 కేవీ పరిధి 11కేవీ ఆరిలోవ ఫీడర్ మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా పలు ప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ సందర్భంగా సంతపాలెం, తోటగరువు, రవీంద్రనగర్, గాంధీనగర్, బాలాజీనగర్, శ్రీహరినగర్, ముస్తఫా కాలనీ, కై లాసనగర్‌లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన



బజారులో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మన్‌మోహన్, ఆరోగ్య సిబ్బంది

సీతమ్మధార: రెండు వారాల కంటే ఎక్కువగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారు తక్షణమే పరీక్షలు చేయించుకోవాలని రేసపువానిపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.మన్‌మోహన్ సూచించారు. జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరావు, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ జి.హెచ్.పూర్ణేంద్రబాబు ఆదేశాల మేరకు క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రాంతాలతోపాటు పిఠాపురం కాలనీ బజారులో అవగాహన కార్యక్రమం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణైతే క్షయ నివారణ కేంద్రం ద్వారా ఉచితంగా వ్యాధి తగ్గే వరకు మందులు ఉచితంగా అందిస్తామని తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వేలో వ్యాధిగ్రహస్తులను గుర్తించి ప్రజల్లో మరింత అవగాహన తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సునీత, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



అవగాహన సదస్సులో పాల్గొన్న సిబ్బంది

కొమ్మాది: వాహన చోదకులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాస్ అన్నారు. బీచ్ రోడ్డు రాడిసన్ బ్లూలో రోడ్ సేఫ్టీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ పెట్టుకోవడం విధిగా అలవరుచుకోవాలన్నారు. అతి వేగం, ట్రిపుల్ డ్రైవింగ్ నేరమని హెచ్చరించారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడడం ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ జాన్ మనోహర్, ద్వారకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్ణానంద జన్మదిన వేడుకలు



అభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

ఎంవీపీకాలనీ: శ్రీసాయి సుధాకర్ పూర్ణానంద స్వామీజీ జన్మదిన వేడుకలు ఎంవీపీ కాలనీలోని శ్రీసాయి గోకుల గురుదత్త విహార్‌లో భక్త బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ నెల 25వ తేదీ వరకు ఈ వేడుకలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం శ్రీలలితా పరాభట్టారికా మాత శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం భగవన్నామ సంకీర్తన, సౌందర్య లహరిపై శ్రీ సాయికృష్ణ శివ సుబ్రహ్మణ్యశర్మతో ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ సేవా శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరనాథ్

బీచ్ రోడ్డు: కృష్ణా కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం యూనిట్-4 ప్రత్యేక సేవా శిబిరాన్ని శుక్రవారం ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.హరనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలోను, ప్రజలను సమాజం, సేవల పట్ల చైతన్యపర్చడంలోను ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలవాలి



విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఎంపీ ఎంవీవీ, తదితరులు

ఎంవీపీ కాలనీ: సమాజంలోని ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు అండగా నిలవాలని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని లెబన్‌హిల్స్ దివ్యాంగుల పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్ది లక్ష్మణ్‌రెడ్డి తల్లి 12వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతికి అందరూ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, నీలారెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు కేవీ బాబా



మాట్లాడుతున్న కేవీబాబా

కొమ్మాది: నాడు చంద్రబాబు ప్రభుత్వంలో ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు కేవీ బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముస్లింల ద్రోహి అని టీడీపీ నేత నజీర్ విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రభుత్వ పథకాలను దళారీ వ్యవస్థలు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేసి, పేదవారికి అండగా ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఇష్టానుసారం దోచుకునేవని, కానీ నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి, లంచాలకు తావు లేకుండా వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి వైఎస్ జగన్ జన హృదయ నేతగా నిలిచారన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ. 24 వేల కోట్లు అందజేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డిది అన్నారు. నాడు చంద్రబాబు పాలనలో షాదీ తోఫా కింద రూ. 50 వేలు అందిస్తే నేడు సీఎం జగన్ రూ.లక్ష అందిస్తున్నారని, 2022-23 హజ్ యాత్రలకు వెళ్లిన 2977 హాజీలకు రూ.20.03కోట్లు ఖర్చు పెట్టిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు.

మైనారిటీల పక్షపాతి సీఎం జగన్

ఆక్రమణలకు గురైన 32 వేల ఎకరాల వక్ఫ్ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు స్వతంత్ర అధికారాలు ఇస్తూ వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన మైనారిటీల పక్షపాతి సీఎం జగన్ అని కొనియాడారు. చంద్రబాబు హయాంలో ఇమామ్‌లకు ఇచ్చే రూ. 5వేలును పదివేలకు, మౌజన్‌లకు ఇచ్చే రూ.3 వేలను రూ.5వేలకు పెంచిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. చంద్రబాబు ముస్లింలను రాజకీయంగా అభివృద్ధి చేయలేదని.. కానీ సీఎం జగన్ ఒక ఉప ముఖ్యమంత్రిని, ఒక శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌ను, నలుగురు ఎమ్మెల్యేలను, నలుగురు ఎమ్మెల్సీలను, ఇద్దరు మేయర్లను, 11మంది మున్సిపల్ చైర్‌పర్సన్లను ఇచ్చి మైనారిటీలకు రాజకీయంగా గుర్తింపునిచ్చారన్నారు. నాటికి, నేటికి ముస్లింలకు ఏం అభివృద్ధి జరిగిందో తేల్చుకునేందుకు టీడీపీ నాయకులు సిద్ధమా అని ప్రశ్నించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన



సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామదాసు, తదితరులు

ఎంవీపీ కాలనీ: అపార్ట్‌మెంట్లు, స్కూళ్లు, వాణిజ్య భవనాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎంవీపీ కాలనీ క్రైమ్ పోలీసులు కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీలోని సెక్టార్-5లో సెవంత్ డే స్కూల్ యాజమాన్యానికి సీసీ కెమేరాల ఏర్పాటుపై అవగాహన కల్పించడంతో పాటు కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంవీపీ కాలనీ క్రైమ్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ రామదాస్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి, వాణిజ్య ప్రదేశాల ఆవరణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు.

క్లుప్తంగా

భాషలతో మానవజాతి వికాసం



ప్రసంగిస్తున్న ఆచార్య పర్వతనేని సుబ్బారావు

ఏయూ క్యాంపస్: భాషలు మానవజాతి వికాసాన్ని తెలియజేస్తాయని విశ్రాంత ఆచార్యుడు పర్వతనేని సుబ్బారావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన అతిథి ప్రసంగం చేశారు. ప్రపంచంలో కొన్ని వేల భాషలు ఉన్నాయని, ఆయా భాషలు జాతి వికాసానికి దోహదం చేశాయన్నారు. తెలుగు భాష ప్రపంచంలో గుర్తింపు పొందిందన్నారు. తెలుగు సాహిత్యానికి వెయ్యేళ్ల చరిత్ర ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, అధ్యాపకులు ఆచార్య ఎ.ఈశ్వరమ్మ, డాక్టర్ ఎ.వెంకటేశ్వర యోగి, డాక్టర్ కె.రత్నశేఖర్, డా. పి.లావణ్య, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీ సర్కార్‌కు ఘన నివాళి



పీసీ సర్కార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఈశ్వరి ప్రభాకర్

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్‌లో శుక్రవారం బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ 111వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీసీ సర్కార్ శిష్యుడు అన్వర్ భాషా మ్యాజిక్ షో చేసి విద్యార్థులను అలరించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ మేజిక్ షో విద్యార్థులకు ఆటవిడుపుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగీత విద్యానిధి పురస్కారం ప్రదానం

బీచ్ రోడ్డు: శివ గంగ సంగీత పరిషత్, ఆంధ్రా మ్యూజిక్ అకాడమీ సంగీత నాట్య ఉత్సవాల్లో భాగంగా సంగీత విద్యానిధి పురస్కార ప్రదానోత్సవాన్ని శుక్రవారం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. గత 23 ఏళ్లలో 25 మందికి ఈ పురస్కారం ప్రదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది ఈ పురస్కారాన్ని హైదరాబాద్‌కు చెందిన డి.రాఘవాచారి, డి.శేషాచారి సోదరులకు అందజేసి, ఘనంగా సత్కరించామన్నారు. ఈ ఉత్సవాలు శని, ఆదివారాల్లో కొనసాగుతాయని తెలిపారు.

వేప చెట్టు నుంచి పాలు



జూలో వేప చెట్టు నుంచి కారుతున్న పాలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఓ వేప చెట్టుకు వారం రోజులు పాలు కారుతున్నాయి. నెమళ్ల ఎన్‌క్లోజర్ దాటిన తర్వాత కనుజులు, అడవి దున్నల ఎన్‌క్లోజర్ల ఎదురుగా ఓ వేపు చెట్టుకు రెండు చోట్ల ఏర్పడిన రంధ్రాల నుంచి పాలు నిరంతరం పడుతున్నాయి. వాటిని ఇక్కడ జూ యానిమల్ కీపర్లు, సిబ్బంది బాటిళ్లలో పడుతున్నారు. చెట్టుకు ఖాళీ వాటర్ బాటిళ్లను కట్టి పాలు సేకరిస్తున్నారు. సందర్శకులు కూడా ఆ పాలను చేతులతో పట్టి రుచి చూస్తున్నారు. ఆవు పాలు మాదిరిగా ఉన్నాయని చెబుతున్నారు.

ఏయూ సమాచారమ్

కంప్యూటర్ సైన్స్‌లో విష్ణుతేజ్‌కి ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి వై.విష్ణుతేజ్‌కి డాక్టరేట్ లభించింది. విభాగ సీనియర్ ఆచార్యుడు, వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, ఏయూ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సంయుక్త పర్యవేక్షణలో సమ్ నోవెల్ అప్రోచెస్ టువర్డ్స్ ఇంప్రూవింగ్ నాయిస్ రిడక్షన్ అండ్ ఎఫెక్టివ్ క్లాసిఫికేషన్ ఆఫ్ శాటిలైట్ ఇమేజెస్ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు విష్ణుతేజ్ స్వీకరించారు.

ఆచార్య కృష్ణమోహన్‌కు జాతీయ పురస్కారం



కృష్ణమోహన్‌ని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది. హిందుస్థాన్ టైమ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 2023 సంవత్సరానికి టాప్-10 ప్రొఫెసర్స్ షేపింగ్ మైండ్స్ ఇన్ ఇండియా పురస్కారంతో సత్కరించింది. దేశ వ్యాప్తంగా 10 మందిని ఆచార్యులను ఎంపిక చేసి ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆచార్య కృష్ణమోహన్‌ని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

దారపాలెంలో స్థల వివాదం



దారపాలెంలో వివాదాస్పదమైన స్థలం

ఆరిలోవ: రూరల్ మండలం పరిధి జీవీఎంసీ 13వ వార్డు దారపాలెంలో రూ.కోట్లు విలువ చేసే ఓ స్థలం వివాదాస్పదమైంది. రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు ఆ స్థలం నాదంటే నాదేనంటూ గొడవ పడ్డారు. ఈ వివాదం పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఇరు వర్గాల వద్ద ఆ స్థలానికి సంబంధించిన పత్రాలు ఉండటంతో పోలీసులు ఎటూ తేల్చుకోలేక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఆ స్థలంలో నకిలీలు ఎవరు, అసలైనవారు ఎవరు అనేది రెవెన్యూ అధికారులే తేల్చాల్సి ఉంది. అనంతరం నకిలీలపై పోలీసులు ఎలాంటి చర్య తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఇరువర్గాల వద్ద డాక్యుమెంట్లు

ఈ స్థలం వివాదంపై ఆరిలోవ సీఐ గోవిందరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీ సమీప దారపాలెంలో 14/1 సర్వే నంబరులో కొంత ఖాళీ భూమి ఉంది. దీనిలో 1,900 చదరపు గజాల స్థలాన్ని కొందరు వ్యక్తుల వద్ద నుంచి 2004లో కొనుగోలు చేసినట్లు అక్కయ్యపాలేనికి చెందిన కొత్తపల్లి పాప వద్ద సంబంధించిన పత్రాలు ఉన్నాయి. ఇదే స్థలంతో పాటు అక్కడ మొత్తం 84 సెంట్లు(4000 చదరపు గజాలకు పైగా) 2012లో రిజిస్ట్రేషన్ అయినట్లు జగ్గునాయుడు, కోడూరు రమేష్ వద్ద పత్రాలు ఉన్నాయి. దీంతో ఈ స్థలం విషయమై ఇటీవల నాదంటే నాదేనంటూ రెండు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. దీనిపై రెండు రోజుల క్రితం కొత్తపల్లి పాప ఆ స్థలం డాక్యుమెంట్లతో వచ్చి తన స్థలాన్ని ఆక్రమిస్తున్నారంటూ ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో జగ్గునాయుడు, కోడూరు రమేష్‌పై ఫిర్యాదు చేశారు. సీఐ గోవిందరావు ఆదేశాలతో ఎస్‌ఐ కృష్ణ, సిబ్బందితో గురు, శుక్రవారాలు వెళ్లి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలం వద్ద ఇరు వర్గాలు వారు ఉన్నారు. కొత్తపల్లి పాప ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగ్గునాయుడు, రమేష్‌లను పోలీసులు నిలదీయడంతో వారు కూడా ఆ స్థలం తమదేనంటూ వారి వద్ద స్థలానికి చెందిన డాక్యుమెంట్లు చూపించారు. పోలీసులు చేసేదిలేక రూరల్ తహసీల్దారుకు ఈ వ్యవహారం గురించి పరిశీలించి అర్హులు ఎవరో తేల్చాలని ఇరువర్గాలకు చెందిన డాక్యుమెంట్లను పంపించారు. ఆ డాక్యుమెంట్లను ఆర్డీవోకు కూడా పరిశీలన కోసం పంపిస్తామని సీఐ గోవిందరావు తెలిపారు. రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారం తేల్చే వరకూ ఎవరూ ఆ స్థలంలోకి ప్రవేశించకూడదని ఇరు వర్గాలకు సూచించామన్నారు.

ఏవీఎన్ కళాశాలకు బీఎన్‌రెడ్డి విరాళం



విరాళం అందజేస్తున్న ఇంద్రజాలికుడు బీఎన్ రెడ్డి

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు బీఎన్‌రెడ్డి తాను చదివిన ఏవీఎన్ కళాశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడుకు ఈ మొత్తం చెక్‌ను అందజేశారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో కళా రంగంలో ప్రతిభ చూపే కళాశాల విద్యార్థికి ఏటా నగదు పురస్కారం అందజేయనున్నారు. కళాశాల పూర్వ విద్యార్థి బీఎన్ రెడ్డి ఇంద్రజాల విద్యలో అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందడం తమకు ఎంతో గర్వకారణమని భానోజీరావు తెలిపారు. ఈ సందర్భంగా బీఎన్‌రెడ్డిని అభినందించారు.

కేజీహెచ్‌లో పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్

- 27న ప్రారంభోత్సవం చేయనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని
- రూ.80 లక్షల వ్యయంతో పలు సౌకర్యాల ఏర్పాటు



పిల్లల వార్డులో కొత్తగా నిర్మిస్తున్న పీఐసీయూ యూనిట్



యూనిట్‌లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు

మహారాణిపేట : కేజీహెచ్ పిల్లల వార్డులో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) ఈనెల 27న ప్రారంభం అవుతుంది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఈ యూనిట్‌ను ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ శుక్రవారం మీడియా ప్రతినిధులకు తెలిపారు. మొత్తం 40 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో ఒక ఏడాది నుంచి ఏడు సంవత్సరాల లోపు పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం చికిత్స అందిస్తామన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ నిధులు రూ. 20 లక్షలు, కేజీహెచ్ నిధులు రూ. 20 లక్షలు, కలెక్టర్ మల్లికార్జున అందించే సీఎస్ఆర్ ఫండ్ రూ. 40 లక్షలతో ఈ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. వెంటిలేటర్ వంటి సదుపాయాలు పొందుపరుస్తున్నామని తెలిపారు. అలాగే కేజీహెచ్‌లో 120 సీసీ కెమెరాలు అమర్చుతున్నామన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలను వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిను ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లారు. స్వామిని అభిషేకించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.